# అతివేగం ఇద్దరు యువకుల ప్రాణాలు బలి

**కొండపూర్, మే 24 ప్రభాత వార్త:** అతివేగంగా బైక్ నడపడం ఇద్దరు యువకుల ప్రాణాలను బలిగొన్న ఘటన కొండపూర్ మండలంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ఎస్ఐ సోమేశ్వరి వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, మండల పరిధిలోని గోటిలగుట్ట తండాకు చెందిన విక్రమ్ (27), మల్కాపూర్ గాయత్రినగర్‌కు చెందిన అనిల్ (30) శనివారం రాత్రి మాచేపల్లి గ్రామ శివారులో జరుగుతున్న జాతరను సందర్శించి బైక్‌పై తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. మండల కేంద్రంలోని మ్యూజియం సమీప మూలమలుపు వద్ద అతివేగంగా వెళ్తున్న బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు విక్రమ్ తండ్రి కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ సోమేశ్వరి తెలిపారు. ఈ ఘటనతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామాల్లో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది.



ప్రమాదానికి కారణం అయిన మోటర్ సైకిల్

## మే 25 నుంచి 30 వరకు
# మహిళా "ఆర్థిక వారోత్సవం" నిర్వహణ

**సంగారెడ్డి మున్సిపాలిటీ , మే 24, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 25 నుండి 30 వరకు జిల్లాలో మహిళా ఆర్థిక వారోత్సవం" నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, స్వయం సహాయక సంఘాల బలోపేతం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కార్య క్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళా సంఘాల ఆర్థిక పురోగతికి దోహదపడే విధంగా అవగాహన కార్యక్రమాలు, రుణమేళాలు, మార్కెటింగ్ అవకాశాలు, నైపుణ్యా భివృద్ధి శిక్షణలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 25న అన్ని ఏ ఎల్ ఎఫ్, , టి ఎల్ ఎఫ్ స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వ హించి మహిళా ఆర్థిక వారోత్సవంపై అవగాహన కల్పించనున్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని ఎస్ హెచ్ జి , ఏ ఎల్ ఎఫ్ సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యక్రమాలపై చర్చించనున్నారు. మే 26 నుండి 30 వరకు మహిళా సంఘాల ద్వారా ఉత్పత్తుల ప్రదర్శనలు, బ్యాంక్ లింకేజీ కార్యక్రమాలు, రుణ మేళాలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన, మార్కెటింగ్ అవకాశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహిళా వ్యాపారవేత్తలకు అవసరమైన రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు, ప్రభుత్వ పథకాల అనుసంధానంపై ప్రత్యేక సహాయం అందించనున్నారు. మే 27న మహిళా వ్యాపారవేత్తలకు మున్సిపాలిటీలలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సేవలు అందించనున్నారు. మే 28న ఐ ఎం ఎస్ కార్యక్రమాలపై అవగాహన, ఎస్ హెచ్ జి మహిళల నైపుణ్యాభివృద్ధి కార్య క్రమాలు నిర్వహించనున్నారు. మే 29న రుణ మేళాలు, మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం, రుణాల మంజూరు కార్యక్రమాలు చేపట్టనున్నారు. మే 30న పి ఎం ఎఫ్ ఎం ఈ పథకం కింద క్రెడిట్ లింక్ సబ్సిడీ రుణాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన మహిళా సంఘాలకు ప్రయోజనాలు కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడే ఈ వారోత్సవ కార్య క్రమాలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు.




సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

# యధేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
## చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు



అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న పనులు


**సంగారెడ్డి మున్సిపాలిటీ మే 24, ప్రభాతవార్త :** సంగారెడ్డి పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. జిల్లా కేంద్రం రాజధానికి సమీపంలో ఉండటంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం, భవన నిర్మాణ రంగాలు ఊపందుకున్నాయి. అయితే, ఇదే తరుణంలో మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా వెలుస్తున్న నిర్మాణాల సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు . మరికొన్ని వార్డులలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని వారు విమర్శిస్తున్నారు. పట్టణ ప్రణాళికా విభాగం (టౌన్ ప్లానింగ్) అధికారుల కళ్ల ముందే నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాలు సాగుతున్నా, వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంగారెడ్డి పట్టణ పరిధిలోని ప్రధాన రహదారి పక్కన 36వ వార్డులో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణ పనులు జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే రహదారిపై నుంచి రోజు జిల్లా కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు రాకపోకలు సాగిస్తున్న ప్పటికీ, సంబంధిత అధికారులకు చీమకుట్టినట్లైనా లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సంగారెడ్డి మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టిపిఒ) విశాల్ ను వివరణ కోరగా 36 వ వార్డులో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం పనులు జరుగుతున్న మాట వాస్తవమేనని, తమ దృష్టికి వచ్చిందని నోటీసులు ఇచ్చి నిర్మాణం పనులు ఆపుతామని ఆయన బదులిచ్చారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

# ఆకాశంలో అద్భుతం-సూర్యుడి చుట్టూ వలయం

**సిర్గాపూర్, మే 24, ప్రభాతవార్త:** ఆకాశంలో ఆదివారం అద్భుతం ఆవిష్కృత మయింది. ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంతో సూర్యుడికి దగ్గరగా చుట్టూ వృత్తాకారం చిన్నగా కనిపించింది. 11.15 గంటలకు పరిశీలిస్తే సూర్యుడి చుట్టూ ఏర్పడిన వృత్తాకారం సూర్యుడిని వదిలి రౌండ్ సర్కిల్ పెద్దగా అవుతూ వచ్చింది. వృత్తాకారంలోని సూర్యుడిని చూసి ప్రజలు తమ సెల్ ఫోన్‌లను అరుదైన దృశ్యాన్ని బంధించు కున్నారు. భారత దేశ వ్యాప్తంగా ఇలా కనిపించడంతో ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



ఆకాశంలో సూర్యుడి చుట్టూ వలయం ఏర్పడిన దృశ్యం


మండుతున్న ఎండలు...

# నిప్పుల కొలిమిలో జనజీవనం..!!

...ఉష్ణతాపం ఉక్కిరిబిక్కిరి
.. పల్లె నుంచి పట్టణం వరకు ప్రజల విలవిలలు
...ఉదయం 9 దాటితే చాలు ప్రతాపం చూపెడుతున్న సూరీడు

**రామాయంపేట, మే 24, ప్రభాతవార్త :** ఈ వేసవి సాధారణం కాదు..సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు..రోడ్లు అగ్నిగుండాల్లా మారాయి..ఇంట్లో ఉంటే ఉక్కపోత.. బయటికి వస్తే ఎండదెబ్బ..రోడ్లపై తారు కరుగుతోంది... చెట్ల నీడలు సైతం మాయ మవుతున్నాయి...పల్లె నుంచి పట్నం దాకా ప్రజల బతుకులు ఉడికిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటి రికార్డులు బద్దలు కొడుతుండగా, సామాన్యుడి గుండె మండిపోతోంది. ఇది కేవలం ఎండ కాదు.. జనాన్ని పరీక్షి స్తున్న ప్రకృతి శాపం. భగభగమండుతున్న భానుడు.. 45 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు...

తెలంగాణ వ్యాప్తంగా మే నెల చివరి వారంలో ఎండలు తీవ్ర రూపం దాల్చాయి. మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధిలో గరిష్ఠ ఉష్ణోగ్రత 46.2 డిగ్రీలకు చేరినట్లు అధికారులు చెబుతున్నారు. గత పదేళ్లలో ఇదే అత్యధికం అని వాతావరణ శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 వరకు బయటకు వచ్చే సాహసం చేయడం లేదు జనం. ఆటోలు, బస్సులు సైతం ప్రయాణికులు లేక ఖాళీగా తిరుగుతున్నాయి.



ఎండలు తీవ్రత వల్ల ఖాళీగా ఉన్న రోడ్లు

**వడగాల్పుల విలయం... పిట్టల్లా రాలుతున్న బాటసారులు....**

వడదెబ్బకు మండల వ్యాప్తంగా గత వారంలో చాలా మంది ఆస్పత్రుల పాలయ్యారు. రామాయంపేటలో పొలం పనులకు వెళ్తున్న రైతులు ఎండ వేడికి ఇబ్బందుల పాలవుతున్నారు. వైద్యులు సైతం మధ్యాహ్నం వేళ అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని హెచ్చరిస్తున్నారు.

**కూలీల బతుకులు కాలిపోతున్నాయ్..**

భవన నిర్మాణ కార్మికులు, హమాలీల పరిస్థితి మరీ దారుణం. ఎండకు ఇటుకలు చేతితో పట్టుకోలేకపోతున్నాం. కాలిపోతున్నాయి అని తాపీ మేస్త్రీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 11 దాటితే సిమెంట్, స్టీల్‌ను వాహనాల్లోకి మార్చలేకపోతున్నామంటూ హమాలీలు నిట్టూరుస్తున్నారు.

**విద్యుత్ కోతలు.. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి...**

ఎండలతో పాటు కరెంట్ కోతలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రామాయంపేట మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అప్రకటిత కరెంట్ కోతలు ఉంటున్నాయి. "ఫ్యాన్ తిరగదు, కూలర్ పనిచేయదు. పిల్లలు ఉక్కపోతతో ఏడుస్తున్నారు. రాత్రిపూట నిద్ర కరువైంది" అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏసీలు, కూలర్ల వినియోగం పెరగడంతో ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అవుతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

**అత్యవసరమైతేనే బయటకు రండి...డాక్టర్‌ల సూచన..**

ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రావొద్దు. తెల్లటి కాటన్ దుస్తులు ధరించాలి. వదులుగా ఉండే దుస్తులు వేసుకోవాలి. ఎక్కువగా మజ్జిగ, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తాగాలి" అని మండల వైద్యాధికారి డాక్టర్ వైశాలి సూచించారు.

**సూరీడు శాంతించేదెన్నడు....**

ఎండ తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించడం లేదని వాతావరణ శాఖ తెలిపింది. మరో వారం రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని, జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు వస్తేనే ఉపశమనం లభిస్తుందని అంచనా. అప్పటివరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు ఎండలోకి వెళ్లకుండా జాగ్రత్త పడాలని అధికారులు సూచిస్తున్నారు. మండే ఎండల నుంచి తప్పించుకోవడం ప్రస్తుతానికి మన చేతుల్లోనే ఉంది. జాగ్రత్తగా ఉంటేనే ఈ నిప్పుల వేసవిని దాటగలం.

## అక్రమ సంబంధం కోసం ...
# భర్తను హతమార్చిన భార్య

### ..సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలో సంచలన ఘటన

**నారాయణఖేడ్, మే 24 ప్రభాతవార్త :** నారాయణఖేడ్ మండలం గంగాపూర్ గ్రామంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. అక్రమ సంబంధానికి భర్త అడ్డుగా వస్తున్నాడనే కారణంతో ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖేడ్ మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన ముత్యంరెడ్డి (30) భార్య కల్పన నారాయణఖేడ్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. వీరికి 12 సంవత్సరాల క్రితం వివాహం కాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో మనూర్ మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన గైని పండరితో కల్పనకు అక్రమ సంబంధం ఏర్పడినట్లు సమాచారం. ఈ విషయం భర్తకు తెలిసి తరచూ ప్రశ్నిస్తుండటంతో అతడే తమ సంబంధానికి అడ్డుగా మారుతున్నాడని భావించిన కల్పన, తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయాలని పథకం రచించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

గతవారం పథకం ప్రకారం ముత్యంరెడ్డిని ఎల్గోయి శివారుకు తీసుకెళ్లి హత్య చేసి, అనంతరం జేసీబీతో గుంత తవ్వించి మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు తెలుస్తోంది. తరువాత రోజు భర్త కనిపించడం లేదంటూ భార్య కల్పన పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా, కల్పన ప్రవర్తనపై అనుమానం వ్యక్తమైంది. ఆమె మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా గైని పండరితో నిరంతరం ఫోన్ సంభాషణలు జరుపుతున్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు తమదైన శైలిలో విచారించగా, ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు కల్పన ఒప్పుకున్నట్లు సమాచారం. ఆదివారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి నారాయణ ఇక్కడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కేసుపై పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోందని నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రాథమిక విచారణలో మృతుడి భార్య కల్పన భర్త హత్యలో కీలక పాత్ర పోషించినట్లు నమ్మదగిన ఆధారాలు లభించినట్లు పోలీసులు వెల్లడించారు.



ప్రియుడితో కలసి మృతుడి భార్య



భర్త ముత్యంరెడ్డిని పాతిపెట్టిన దృశ్యం.



అంబాజీపేటలో మురుగు కాలువలు లేక ఒక చోట చేరిన నీరు

# మురుగు కాలువలు లేక ఇబ్బందులు

**చిన్నశంకరంపేట, మే 24, ప్రభాతవార్త:** మండలంలోని అంబాజీపేట గ్రామంలో రెండవ వార్డులో మురుగు నీరు చేరి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు లేక నీరు అంతా ఒక చోట చేరడంతో తీవ్ర దుర్వాసన వస్తుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దోమలు కూడ వ్యాపిస్తున్నాయని, జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాధికారుల దృష్టికి తిసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు తెలిపారు. అధికారులు ఈ విషయాన్ని పట్టించుకొని చర్యలు తిసుకోవాలని కోరుతున్నారు.

# చిలపల్లి భారీచోరీ కేసును ఛేదించిన మెదక్ పోలీసులు

వివరాలు 4లో





హుస్నాబాద్‌లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది దృశ్యం

# ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి

- ఆధునాతన వైద్యంతో ప్రజల మొదటి ఎంపికగా మారుతున్న సర్కార్ దవాఖాన
- ఉచిత వైద్యం, విజయవంతమైన ఆపరేషన్లతో రోగులకు తగ్గుతున్న ఆర్థిక భారం
- మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకుంటే రాష్ట్రానికే ఆదర్శంగా హుస్నాబాద్ ఆసుపత్రి

**హుస్నాబాద్ రూరల్, మే 24, ప్రభాతవార్త :** హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్తుతం వైద్య సేవల పరంగా గణనీయమైన పురోగతి సాధిస్తూ ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా నిలుస్తోంది. ఒకప్పుడు రోజుకు 50 నుంచి 100 మంది మధ్య మాత్రమే వచ్చే రోగుల సంఖ్య ప్రస్తుతం 300కు పైగా చేరడం ఆసుపత్రిపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా మారింది. ఆసుపత్రిలో వైద్యులు రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అంది స్తున్నారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సాధారణ చికిత్సలతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు, ఆపరేషన్లు, ప్రసూతి సేవలు విజయవంతంగా నిర్వహించబడుతున్నాయి. దీంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవ సరం తగ్గి పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఆర్థిక భారం తప్పు తోంది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సమన్వయంతో సేవలు అందిస్తూ రోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది రోగులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ సమయానుకూల వైద్యం అందించడం వల్ల ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం మరింత పెరుగుతోంది. ఆసుపత్రిలో ఇటీవలనే స్కానింగ్ సౌకర్యం అందుబాటులోకి వచ్చినప్పటికీ రేడియాలజిస్ట్ లేక పోవడం కొంత ఇబ్బందిగా మారింది. అలాగే గుండె వైద్యుడు, మానసిక వైద్యుడు, చర్మవ్యాధుల, చెవి, ముక్కు, గొంతు నిపుణులను నియమిస్తే ఆసుపత్రిలో మరింత నాణ్యమైన సేవలు అందే అవకాశం ఉందని ప్రజలు కోరుకుంటున్నారు. ఆపరేషన్ల సమయంలో కొంత మంది రోగులకు అత్యవసర రక్తం అవసరమైన సందర్భాల్లో ఇబ్బందులు ఎదురవు తున్నాయని, ఒక బ్లడ్ బ్యాంక్ మంజూరు చేస్తే మరింత సమర్థవంతమైన సేవలు అందించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. హుస్నాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఆసుపత్రికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తే భవిష్యత్తులో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచే అవకాశాలు ఉన్నాయని ప్రజలు భావిస్తున్నారు.

# నర్సాపూర్‌కి ఒక కొత్త శోభ
## కోటి 20 లక్షలతో కోమటికుంట సుందరీకరణ
## చకా చకా సాగుతున్న పనులు



కట్ట వెడల్పు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు పనులు

**నర్సాపూర్, మే 24, ప్రభాతవార్త :** నర్సాపూర్ తూప్రాన్ ప్రధాన రోడ్డుపై గల కోమటికుంట గతంలో స్వచ్ఛమైన నీరుతో . కుంట కిందనున్న ఆయకట్టు పొలాలన్నీ సాగుతో పచ్చగా కలకలలాడేవి కాలక్రమేనా ఈ కుంటలో పట్టణంలోని మురికి నీరంతా చేరి కలుషితమైయి. మురికి కూపంగా మారింది కుంట కింద ఆయకట్టు పొలాలన్నీ ప్లాట్లుగా మారి భవనాలను నిర్మించారు. దీంతో సాగునీరు కూడా పనికి రాకుండా పోయింది. కోమటికుంట మొత్తం చిత్త చెదారంతో నిండిపోయి డంప్ యాడ్ లా మారింది. పట్టణ ప్రజలు కోమటికుంట పరిస్థితిని చూసి కుంటను అభివృద్ధి చేస్తే బాగుంటుందని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఇటీవల నర్సాపూర్ పట్టణ ప్రగతి కోసం 15 కోట్ల నిధులు మంజూరు కాగా అందులో నుండి కోటి 20 లక్షల వ్యయంతో కోమటికుంట సుందరీకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. దీంతో ఈ కోమటికుంట సుందరీకరణ అభివృద్ధికి మోక్షం లభించగా సుందరీకరణ పనపారంభమయ్యాయి.

**- మురికినీరు చేరకుండా ప్రత్యామ్నాయ డ్రైనేజీకి చర్యలు**

మురికి నీరు చేరకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకో నున్నారు. ముందుగా కోమటికుంటలోకి మురికి నీరు చేరకుండా మున్సిపాలిటీ అధికార యంత్రాంగం మాస్టర్ ప్లాన్ వేసి కుంటలోకి చేరే మురికినిరంతా డ్రైనేజ్ సిస్టం ఏర్పాటు చేసి మెదక్ హైదరాబాద్ జాతీయ రోడ్డు పక్కన గల డ్రైనేజీలో కలపడానికి చర్యలు చేపట్టారు.

**కట్టను వెడల్పు చేసి కొత్త హంగులు..**

కోమటికుంట సుందరీకరణ పనుల్లో భాగంగా కట్టను వెడల్పుగా విస్తరించి కొత్త హంగులతో వాకింగ్ ట్రాక్ ఓపెన్ జి మ్ , గార్డెనింగ్ వంటి సౌకర్యాలు ఆధునిక పద్ధతులతో ఏర్పాటు చేయనున్నారు. సాయంత్రం వేళలో పట్టణ ప్రజలు పేద తీర్చుకునే విధంగా వసతులు కల్పించనున్నారు. గతంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించిన మహనీయుల విగ్రహాలను పట్టణంలోని చిల్డ్రన్ పార్క్‌లో ఉంచగా అట్టి మహనీయుల విగ్రహాలను సైతం ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో కోమటికుంటలో నున్న మురికి నీటిని గుర్రపుటేక్కలను తొలగించారు. ఈ కోమటికుంట సుందరీకరణతో నర్సాపూర్ పట్టణానికి ఒక కొత్త శోభ సంతరించుకుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**కోమటికుంటను సుందరీకరించి ఆదర్శంగా నిలుపుతాం.**



కోమటికుంట సుందరీకరణికు చకా చకా సాగుతున్న పనులు

**మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్..**

నర్సాపూర్ పట్టణానికి మంజూరైన 15 కోట్ల నిధులతో పట్టణమంతా అభివృద్ధిని చేసి జిల్లాలోని నర్సాపూర్ పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు.

ఇందులో భాగంగానే కోమటికుంట సుందరీకరణకు కోటి 20 లక్షలు నిధులతో ఆధునిక హంగులతో కోమటికుంటను అన్ని వసతులు కల్పించి అభివృద్ధి చేస్తానన్ని మున్సిప ల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ వెల్లడించారు.



కోమటికుంట సుందరీకరణికు శ్రీకారం చుట్టిన మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్.నర్సాపూర్ పట్టణానికి ఒక కొత్త శోభ

# ఏడుపాయలలో భక్తుల సందడి..


భక్తులకు దర్శనిమిస్తున్న వనదుర్గమ్మ


దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు


భక్తులకు మజ్జిగ వితరణ చేస్తున్న దృశ్యం

**భారీగా తరలి వచ్చిన భక్తులు..**
**బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కుల చెల్లింపులు..**

**పాపన్నపేట, మే 24, ప్రభాతవార్త :** భక్తుల కోరికలు తీర్చే తల్లిగా పేరు గాంచిన ఏడుపాయల వనదుర్గ భవాని క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది .వేసవి సెలవులు, ఆదివారం సెలవు దినాలు కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. సుదూరప్రాంతాలనుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. వీరు మంజీరా నదిలోని వివిధ పాయ ల్లో పుణ్యస్నానాలుచేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు , బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఇఒ వీరేశం , తమ సిబ్బంది సూర్య శ్రీనివాస్,మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి,బ్రహ్మచారి, బత్తినిరాజు, నర్సింలు, వరుణాచారి, యాదగిరి మహేష్ ,నరేష్, దీపక్, తదితరులు ఏర్పాటు చేయగా వేదపండితులు శంకర శర్మ, పార్థివ శర్మ ,రాము , శేఖర్ నాగరాజు తదితరులు పూజలు నిర్వహించారు, ఏడుపాయలలో ఎలాంటి అవాంఛనియ సంఘటనలు చోటు చేసుకోకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో ప్రత్యేక బందో బస్త్ చర్యలు చేపట్టారు.

**..భక్తులకు మజ్జిగ వితరణ..**

భానుడి ప్రతాపం చూపుతుండడంతో మెదక్ పట్టణంలోని చందనా బ్రదర్స్ వారి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ వితరణ చేపట్టారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆలయ మంటపం వద్ద మజ్జిగను అందివ్వడంతో భక్తులు ఎండ తాపం నుండి ఉపశమనం పొందారు .

# భక్తులతో పోటెత్తిన తునికి నల్ల పోచమ్మ ఆలయం

**కౌడిపల్లి, మే 24, ప్రభాతవార్త:** జిల్లాలలోనే రెండవ అతి పెద్ద జాతరగా పేరుగాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం ఆది వారం నాడు భక్తులతో పోటెత్తింది. ఉదయం నుండియే భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయ ఇంచార్జి ఈవో రంగరావు, అభివృద్ధి కమీటి చైర్మెన్ తాళ్ల శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారి శివప్ప వేద మంత్రాల నడుమ అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనాలను కల్పించారు. కౌడిపల్లి పద్మశాలి సంఘం మండల యూత్ అధ్యక్షులు సంబారపు తిరుమల్లేశ్ తన కుటుంబ సభ్యులు కలిసి వచ్చి తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు శివ సత్తుల శిగాలు, డప్పు చప్పుల దరువుల నడుమ అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకోచ్చి ఆలయం చుట్ట ప్రదక్షణలు చేసిన


తునికి శ్రీనల్ల పోచమ్మకి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకుంటున్న దృశ్యం.

తర్వాత అమ్మవారి ఎదుట బోనం నైవేద్యాలను పెట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గర్భగుడిలో అమ్మ వారి దర్శనం చేసుకోని తీర్థ ప్రసాదాలను స్వీకరించి, అమ్మ ఆశీర్వాచనం పోందారు. కొంత మంది భక్తులు తమ కోరికలు తీర్చిన శ్రీ నల్ల పోచమ్మ తల్లికి ఒడి బియ్యం సమర్పించి, జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయం సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వేసవి ఎండ తీవ్రత రూపం దాల్చుతున్న సందర్భంలో ఆలయంకు విచ్చేసే భక్తులకు త్రాగునీటి సమస్య రాకుండా ఆలయ అభివృద్ధి కమీటీ సభ్యులు, ఆలయ సిబ్బందితో మౌళిక సదూపాయాలను కల్పిస్తున్నట్లు ఈవో తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తొచినంత విరాళాలు ఇస్తే భక్తులకు సౌకర్యార్థం కాటేజ్‌లు నిర్మించ బడుతాయని ఇంచార్జి ఈవో రంగ రావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీరితో పాటు గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి శేఖర్, ఉప సర్పంచ్ మధుసూధన్ గౌడ్, ఆలయం జూనియర ఆసిస్టెంట్ వెంకట్ రెడ్డి, ఆలయ పూజారి రాజేశ్వర్, విఘ్నేశ్ అప్ప, గ్రామ పెద్దలు సాయా గౌడు, శంకర్, శేఖర్, చల్ల మల్లేశం, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనసంద్రంగా బోరంచ నల్లపోచమ్మ ఆలయం


బోరంచ నల్ల పోచమ్మ తల్లి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**మనూర్, మే 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బోరంచ గ్రామంలో కొలువున్న శ్రీ నల్లపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో జన సంద్రంగా మారింది. ఆలయంలో ఏడు వారాల ఉత్సవాలు కొనసాగుతుండటం, ఆదివారం సెలవు రోజు కావడంతో ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయంలో అలయ అర్చకులు శ్రీ కాంత్ స్వామి, సిద్దుస్వామి, నాగయ్యస్వామి, ప్రవీణ్‌స్వామిలు వేద మంత్రాలు వల్లిస్తుండగా అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తులు తమ కోర్కెలు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులు తీర్థ ప్రసాదాలు అందచేసి ఆశీర్వచనాలు చేశారు. ఆయా ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులకు అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు కల్గకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తుల ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసుటు గట్టి బందోబస్తును నిర్వహించారు. కార్యక్మమంలో ఆలయ సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ

**యువతి,యువకులు సద్వినియోగం చేసుకోవాలి**
**మాజీ మంత్రి, ఎమ్మెల్యే : హరీష్‌రావు**

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో 4 రోజుల పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై వర్క్ షాప్, శిక్షణ ఇవ్వడం జరుగుతుందని యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న దానికి అనుగుణంగా విద్యార్థులు, యువకులు సైతం వారి నిత్య జీవితాల్లో టెక్నాలజీని అందిపుచ్చుకో వాలని భవిష్యత్‌లో ఉద్యోగఅవకాశాలకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈనెల 27 నుంచి 30 వరకు వర్క్‌షాప్ శిక్షణ జరుగుతుందన్నారు. ఈ శిక్షణ ప్రయోజనాలు పరిజ్ఞానం ఆధారిత సాంకేతిక పరిచయం, డిజిటల్ నైపు ణ్యాన్ని పెంపొందించుకోవడం, ఆత్మ విశ్వాసం, వ్యక్తిత్వ వికాసం ఏన్నో బలమైన అడుగులు ఈ శిక్షణ ద్వారా పొందవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెన్త్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హుల న్నారు. ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్,2 పాస్ ఫోటోస్ అన్ని జిరాక్ కాపీలతో జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఈనెల 26వరకు రిజిస్టర్ చేసుకోవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు 9490243095 సంప్రదించాలన్నారు.

### హెచ్‌ఎంఎస్ ఎల్లప్పుడూ కార్మికుల కోసం పోరాడుతుంది

**మిరుదొడ్డి, మే 24, ప్రభాతవార్త :** హెచ్‌ఎంఎస్ హిందూ మజ్దూర్ సభ బీడీ కార్మిక సంఘం ఎల్లప్పుడూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని హెచ్‌ఎంఎస్ హిందూ మజ్దూర్ సభ రాష్ట్ర అధ్యక్షులు ఈదారి మల్లేశం అన్నారు. హెచ్‌ఎంఎస్ హిందూ మజ్దూ ర్ సభ ఆధ్వర్యంలో బీడీ కార్మికుల వేతనాల పెంపు నేపథ్యంలో మండల పరిధిలోని ధర్మారంలో దేశాయి బ్రదర్స్ లిమిటెడ్ బీడీ సెంటర్‌లో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీడీ కార్మికుల వేతనాల పెంపు కోసం కృషి చేసిన ఈదారి మల్లేశంను నెలసరి వేతనాలు పొందే కార్మికులు, గంపచాట కార్మికులు,ప్యాకింగ్ కార్మికులు ఘనంగా సత్కారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగేలా తమ సంఘం కట్టుబడి పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ మండల అధ్యక్షులు రమేష్, బిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వేతనాల పెంపుకు కృషి చేసిన మల్లేశంను సత్కరిస్తున్న దృశ్యం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గం

### శ్రీ లక్ష్మీ నరసింహ పురుషుల పొదుపు సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**బెజ్జంకి, మే 24,ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ పురుషుల పొదుపు సంఘం 26వ వార్షిక మహాసభను సంఘం అధ్యక్షులు బుర్ర కిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్య క్రమంలో సమితి ప్రతినిధులు వార్షికోత్సవానికి సంబంధించిన నివేదికలను సంఘ సభ్యుల ఎదుట చదివి వినిపించారు. సంఘానికి సంబంధించిన విధి విధానాలను సభ్యులకు తెలిపారు. అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ పురుషుల పొదుపు సంఘం నూతన అధ్యక్షులుగా బుర్ర కిషన్, ఉపాధ్యక్షులుగా వడ్లూరి సాయిలను పాలక వర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలవర్గ సభ్యులుగా వడ్లూరి సాయిలు, బుర్ర కిషన్,బోనగరం లక్ష్మీనారాయణ, వడ్లూరి శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

### లక్ష్మీపూర్‌లో అవగాహన సదస్సు

**బెజ్జంకి, మే 24, ప్రభాతవార్త :**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని లక్ష్మీపూర్‌లో సర్పంచ్ ముక్కిస కవిత రత్నాకర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో బాలికలను రక్షిద్దాం..బాలికలను చదివిద్దాం, మహిళలు, చిన్న పిల్లల పై జరుగుతున్న ఆత్యాచారాలపై వివరించారు. (సఖి సెంటర్) 181 ద్వారా మహిళలకు అత్యవసర సమయంలో ఆదుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆడపిల్లను ఎదుగనిద్దాం చదవనిద్దాం. బాల్య వివాహాలను నిర్మూలిద్దాం అనే పలు అంశాలపై ప్రజలకు, మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిహెచ్‌ఈడబ్ల్యు ఎలుకంటి పద్మ, పంచాయతీ కార్యదర్శి బాబు, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మీ, వివో అధ్యక్షురాలు పర్వీనా, పెద్దిరెడ్డి లక్ష్మారెడ్డి, ముక్కిర రాజు నల్లగొండ మొండయ్య, లింగాల శంకర్, ముక్కిస పద్మ, పాకాల యేశవ్వా, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

## పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకోండి

**నర్సాపూర్, మే 24, ప్రభాతవార్త :** నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని అర్హులైన ప్రజలు పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపల్‌లో నివాసముంటున్న అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వృద్ధాప్య వితంతు చేనేత కార్మికులు ఒంటరి మహిళలు కల్లుగీత కార్మికులు ఆసరా పెన్షన్ల కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పెన్షన్ల దరఖాస్తు చేయడానికి సంబంధిత ధ్రువపత్రాలతో పూర్తి వివరాలతో మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పెన్షన్లకు సంబంధించిన అర్హత గల వివరాలు మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంతేగాక కార్యాలయంలో ఉన్న మున్సిపల్ అధికారులను సంబంధించి వారు సూచించిన ధ్రువపత్రాలను దరఖాస్తు ఫారం కు జతచేసి పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ సూచించారు. ఈ సమయంలో మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




పిల్లలకు సర్టిఫికెట్లు ప్రధానంలో పాల్గోన్న మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్,వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్

### కిక్ బాక్సింగ్‌తో శరీర దృఢత్వం

**నర్సాపూర్, మే 24, ప్రభాతవార్త :** కిక్ బాక్సింగ్‌తో మానసిక ఉల్లాసంతో పాటు శరీర దృఢత్వం పెరుగుతుందని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్, వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ అన్నారు నర్సాపూర్ పట్టణంలోని విజేత హైస్కూల్లో మెదక్ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు విద్యార్థులకు కిక్ బాక్సింగ్ కర్ర సాము సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. అయితే శనివారం ముగింపు కార్యక్రమం సందర్భంగా పిల్లలకు సర్టిఫికెట్లు ప్రధానం చేయగా ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్, వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవులు హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో జరుగుతున్న దుర్ఘటనల దృష్ట్యా ప్రతి అమ్మాయి తనను తాను కాపాడుకోవడానికి ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవడం ఎంతో అవసరమని గుర్తు చేశారు వేసవిలో కిక్ బాక్సింగ్ పై శిక్షణ ఇవ్వడం ఎంతో అభినందనీయమని అందుకు మెదక్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులను వారు అభినందించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీకాంత్ నిరంజన్ దాస్ అసోసియేషన్ ప్రతినిధులు నాగరాజు శేఖర్ సమీర్ సిద్ధార్థ ఆజాం తదితరులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

### మహాసభను విజయవంతం చేయండి

**చిన్నశంకరంపేట, మే 24,ప్రభాతవార్త:** జూన్ 7,8వ తేదిలలో శివ్వంపేటలో జరిగే 9వ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను విసయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం పిలుపు నిచ్చారు.

ఆదివారం చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. ఉపాధి హామి కూలీలకు మెడికల్ కిట్లు, త్రాగునీటిని అందించలేదన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటిని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షునిగా శ్రీను, కార్యదర్శిగా శంకర్, సభ్యులుగా దేవయ్య, రవీందర్, సురేష్, లింగం, రవిగౌడ్, నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


కొనుగోలు తీరును పరిశీలిస్తున్న ఎఎంసి చైర్మన్ యాదగిరి

### అధిక తూకం కోసం రైతులను వేధిస్తే చర్యలు తప్పవు

**నంగునూర్, మే 24,ప్రభాతవార్త :**మిల్లర్లు, రైతులకు,ప్రభుత్వానికి సహకరించాలని లేదని విరుద్ధంగా అధిక తూకం కోసం రైతులను వేధిస్తే చర్యలు తప్పవని మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని కొండంరాజపల్లి, ఘనపూర్, తిమ్మాయిపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ధాన్యం కొనుగోలు సమయంలో రైస్ మిల్లర్లు తరుగు, తేమ శాతం పేరిట రైతులను తీవ్రంగా వేధిస్తున్నారని ఇది సరికాదన్నారు. బస్తాకు 3 కిలోల తరుగుకు ఒప్పుకుంటేనే దిగుమతి చేసుకుంటామని లేదంటే ధాన్యాన్ని దిగుమతి చేసుకోమని బెదిరింపులకు దిగుతు అడ్డగోలు దోచుకొని ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని మండిపడ్డారు. తరుగు పేరిట దోపిడి, వడ్లలో తాలు, మట్టి ఉందనే సాకుతో తరుగు తీయడం వలన రైతులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. పలు సాకులతో అడ్డగోలు కటింగ్‌లకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లర్లు కటింగ్‌లను పక్కనబెట్టి రైతులకు అండగా నిలువాలన్నారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు చేర్యాల రాజు,బాగు శ్రీకాంత్‌యాదవ్, పిల్లి నర్సింలు, లక్ష్మణ్, రజినీకాంత్, తిరుపతి, సురేష్ తదితరులు ఉన్నారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు దృశ్యం

### ధాన్యం తరలింపులో జాప్యం పై
# రైతుల ధర్నా.. రాస్తారోకో

**కొల్చారం, మే 24, ప్రభాతవార్త :** కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేట మంజీరా వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతుందని ఆరోపిస్తూ రైతులు ఆదివారం మెదక్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సమాచారం అందుకున్న కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహినుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఈ సందర్భంగా మంజీరా వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసి రోజుల తరబడి గడుస్తున్నప్పటికీ లారీలు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం కేంద్రంలోనే పేరుకుపోయిందన్నారు. ధాన్యం తరలింపులో సంబంధిత అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు.

కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించిన ధాన్యాన్ని కూడా రోజుల తరబడి అన్‌లోడింగ్ చేయకపోవడం వల్ల లారీలు తిరిగి రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అదనపు లారీలను ఏర్పాటు చేసి ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పుర్రె ప్రభాకర్, ఆగం గౌడ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.


పద్మారెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ముదిరాజ్ సంఘ నాయకులు

### మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

**చిన్నశంకరంపేట,మే 24,ప్రభాతవార్త:** మండలంలోని టీ మాందాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29,30వ తేదిల్లో నిర్వహించే పెద్దమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాలకు రావాలని మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డికి ఆదివారం ముదిరాజ్ సంఘం అందించారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, యాదగిరి, గణేష్ పాల్గొన్నారు.

### నిత్య ప్రసాద వితరణ కోసం రూ.2లక్షలు విరాళం అందజేత

**కొమురవెల్లి, మే 24, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న నిత్య ప్రసాద వితరణ కోసం ముంబాయికి చెందిన మడుపతి మల్లేష్ కవిత దంపతులు వారి తల్లిదండ్రులు మడపతి గంగారాం బీమవ పేరుపై రూ.200232 లక్షల విరాళం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ వర్గాలు మల్లేష్ దంపతులను స్వామి వారి శేష వస్త్రం, చిత్ర పటం, స్వామి వారి ప్రసాదాన్ని అందించారు. ఆలయ పర్యవేక్షకులు నీల చంద్రశేఖర్ విరాళం తీసుకొని మల్లేష్‌కు రశీదు ఇచ్చిరు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



మల్లేష్ దంపతులకు స్వామి వారి చిత్ర పటం అందజేస్తున్న దృశ్యం

### ఉత్తమ విద్యార్థులకు ఘన సత్కారం

**కొమురవెల్లి, మే 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మర్రిముచ్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆదివారం ఎన్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సత్కారించారు. అలాగే ఎస్సీ కాలనీ స్కూల్‌కు చుంచు ప్రదీప్‌కుమార్ పిల్లలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడానికి తన స్వంత డబ్బులతో వాటర్ ప్యూర్ ఫయ్యర్ అందించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఎం ఫౌండేషన్ అధ్యక్షులు నక్కల నరేష్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల, గ్రామాభివృద్ధిలో ఎన్ఆర్ఎం సభ్యులు ఎప్పుడు ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఎం సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

### పొద్దుతిరుగుడు కొనుగోళ్ళు పున:ప్రారంభం

**మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ**

**బెజ్జంకి, మే 24,ప్రభాతవార్త :**మండలంలో పొద్దు తిరుగుడు పంట కొనుగోలు ప్రక్రియలో కొంత ఆలస్యం జరిగినప్పటికీ ఈనెల 25 నుంచి తిరిగి కొనుగోలు ప్రారంభించడం జరుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొద్దుతిరుగుడు పంటను కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బెజ్జంకి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతుల తమ పొద్దుతిరుగుడు పంటను అమ్ముకొని మద్దతు ధరను పొందాలన్నారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని వివరించారు.

### కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుంది


**టిపిసిసి ఎస్సీసెల్ వైస్ చైర్మన్ కొమ్ము విజయ్‌కుమార్**

**సిద్దిపేట అర్బన్, మే 24,ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని టిపిసిసి ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ కొమ్ము విజయ్‌కుమార్ అన్నారు. టిపిసిసి ఎస్సీ సెల్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆదివారం సిద్దిపేటకు విచ్చేసిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనరతం విజయ్‌కుమార్ పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో ఓపికతో పని చేస్తూ ముందుకు సాగితే పదవులు వాటి అంతట అవే వస్తాయని గుర్తు చేశారు. టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నాయ కత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ సెల్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పేదల, రైతుల, మహిళల, విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ సర్కార్ ముందుకు సాగుతుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ఎఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్, ముద్దం లక్ష్మీ, పుట్ల ఏసు, కొత్తూరి యాదగిరి, పుట్ల ప్రసాద్, వడ్లకొండ రవీందర్‌గౌడ్, సడిమెల బాలయ్య, కవిత, బయ్యారం యాదగిరి, భానుచందు, బండమీది తిరుపతి,కొమ్ము యాదగిరి, బందేల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.


టిపిసిసి ఎస్సీసెల్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

### లైసెన్స్ సర్వేయర్స్ హక్కుల సాధనకు 26న ఛలో హైదారాబాద్

**సిద్దిపేట రూరల్, మే 24, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్ కేటాయించి తమతో పని చేయించుకుంటున్నారు కానీ వేతనాలు మాత్రం ఇవ్వ దం లేదని తెలంగాణ రెవెన్యూ లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లైసెన్స్ సర్వేయర్లకు కనీస పన గౌరవ వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. తాము కష్టపడిన పనికే వేతనం అడుగుతున్నామని తమది గొంతెమ్మ కోరిక కాదని గౌరవప్రదమైన హక్కు అన్నారు. తమ హక్కుల సాధన కోసం ఈనెల 26న ఛలో హైదారాబాద్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. హైదారాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద నిర్వహించే లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషనన ఆత్మగౌరవ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు తిరుపతి,బాలకృష్ణ, రామానుజన్, బిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

### నీటి వృధాను అరికట్టాలి. ..

**చిలిపిచెడ్, మే 24, ప్రభాతవార్త :** గ్రామంలో ఉదయం 6 గంటల నుండి సర్పంచ్ పాలక మరియు ఉప సర్పంచ్ పంచాయతీ కార్మికులు కలిసి గ్రామంలో ప్రతి ఇంటి ఇంటికి తిరిగి నీళ్ల ఎవరికి వస్తున్నాయి. ఎవరికీ రావట్లేదు ఎక్కడ నీళ్ల వృధా అవుతున్నాయి అని తిరిగి చూశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనిల్ నీళ్ల అవసరం ఉన్న వరకు పట్టుకొని మిగతా నీళ్ల వృధా పోకుండా బంద్ చేసి నీటి సమస్యకి సహకరించలని కోరారు. .


నీటి వృధాను పరిశీలిస్తున్న సర్పంచ్.

# నెలాఖరులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

## మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి మున్సిపాలిటీ , మే 24, ప్రభాతవార్త :** జిల్లాలో అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆదివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం కొనుగోళ్లు, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 25 నుండి 30 వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారోత్సవాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.



గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్నచోట వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు.

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుండి నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారోత్సవాలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ,జిల్లాలో అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని, వరి, మొక్కజొన్న కొనుగోళ్లను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.మహిళా సంక్షేమ వారోత్సవాల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి, షెడ్యూల్ మేరకు కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్యాంపు కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా పౌరసరఫరాల అధికారి బాల సరోజ, సివిల్ సప్లై డీఎం జయశ్రీ, మెప్మా అధికారి రామాచారి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

## ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో...

# రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్

**నర్సాపూర్, రూరల్ మే 24 ప్రభాతవార్త:** నర్సాపూర్ మండలంలోని నాగులపల్లి, మూసాపేట గ్రామాల్లో ఉన్న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యం నెల రోజులుగా నిల్వ ఉండిపోయిందని, ప్రభుత్వం వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో సంచుల కొరత, కూలీల సమస్యల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ మెదక్ జిల్లా శాఖ రైతులకు అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని భరోసా ఇచ్చారు.

రేపటి నుంచి బీజేపీ రాష్ట్ర పార్టీ మూడు బృందాలుగా ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులను కలుసుకుంటుందని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపట్టేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్, నర్సాపూర్ మండల అధ్యక్షుడు నీలి నగేష్, సీనియర్ నాయకుడు సంజీవ్ రెడ్డి, బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సదానందం, మహేష్, ప్రశాంత్, మల్లేశం, ప్రవీణ్, భాస్కర్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన వై. నరోత్తం

**జహీరాబాద్, మే 24 (ప్రభాత వార్త):** విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ను ఆదివారం ఆయన నివాసంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా హరీష్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేసిన వై. నరోత్తం, ఆయన విదేశీ పర్యటనకు సంబంధించిన విశేషాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలు తదితర అంశాలపై ఇరువురు స్వల్పంగా చర్చించినట్లు సమాచారం.



విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ వచ్చిన మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం

హరీష్‌రావు విజయవంతంగా విదేశీ పర్యటన పూర్తి చేసుకుని తిరిగి రావడంపై వై. నరోత్తం హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.

# కొల్చారం మండల కేంద్రంలో విషాదం

## అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

**కొల్చారం, మే 24 (ప్రభాత వార్త):** అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ అహ్మద్ మొహియుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మంగలి వెంకటేశం (48) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఆయన భార్య రేణుక కూలీ పనులు చేస్తూ కుటుంబ పోషణకు తోడ్పడుతోంది.

ఆదివారం ఉదయం రేణుక కూలీ పనులకు వెళ్లగా వెంకటేశం ఇంటి వద్దే ఉన్నాడు. మధ్యాహ్నం సమయంలో స్వగృహంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన వెంకటేశం తండ్రి కిష్టయ్య వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు.

సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టి మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గతంలో జరిగిన ప్రమాదంలో వెంకటేశానికి తీవ్ర గాయాలు కావడంతో ఒక కాలు విరిగిందని, అలాగే ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు పేరుకుపోవడంతో వాటిని ఎలా తీర్చాలనే ఆందోళనలో ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పుల భారం భరించలేక మనస్తాపానికి గురై ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

# పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట

## -సంరక్షణ కేంద్రానికి 4 ఎడ్లు 3 ఆవులు-ముగ్గురిపై నమోదైన కేసులు

**న్యాల్‌కల్, మే 24, ప్రభాతవార్త:** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని కర్ణాటకలోని బీదర్ పట్టణం నుంచి నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పట్టణానికి అక్రమంగా తరలుతున్న 7 పశువులను అడ్డుకున్న సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఎస్ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం...అక్రమంగా పశువులు (ఆవులు) తరలకుండా జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్ సూచనల మేరకు మండల పరిధిలోని గంగ్వార్ చౌరస్తా జహీరాబాద్-బీదర్ రోడ్డుపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు గుండా వెళుతున్న కెఎ 38 ఎ 8231 వాహనంను ఆపి తనికీ చేయగా వాహనంలో 4 ఎడ్లు, 3 ఆవులు కానవచ్చాయి. పశువుల రవాణాకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు 7 పశువులను జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు ఎస్ఐ దోమ సుజిత్ పేర్కొన్నారు. అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహన డ్రైవర్ బల్బీం, క్లీనర్ కురేషి అల్తే, యజమాని అజర్‌లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.



అక్రమంగా తరలిస్తున్న 7 పశువలును పోలీసులు అదుపులోకి తీసుకున్న దృశ్యం

# ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు బంగారు భవిష్యత్

- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- సాగును ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- సబ్సిడీపై మొక్కలు, ఎరువుల అందజేత

**నార్సింగి, మే 24, ప్రభాతవార్త:** ఫామ్ ఆయిల్ సాగుతో రైతులకులాభదాయకం అని నార్సింగి మండల వ్యవసాయ అధికారి భరత్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన పంటలలో ప్రస్తుతం మార్కెట్ ఉన్న పంట ఆయిల్ పామ్ మాత్రమే,ఆయిల్ కంపెనీలతో ఒప్పందం చేసుకుని సాగు చేసే పంట రైతులు అమ్ముడానికి కూడా ఇబ్బందులు లేకుండా ఫామ్ ఆయిల్ సాగు పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు.సబ్సిడీ కింద మొక్కలు డ్రిప్పు అందించడమే కాకుండా, నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు కూడా ఇస్తుంది.దిగుబడి ప్రారంభమయ్యే లోపు అంతర్ పంటల ద్వారా సాగు ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు.వరి పత్తి పంటలతో పోలిస్తే పెట్టుబడి కూడా తక్కువగానే ఉంటుంది.అలాగే తక్కువ శ్రమతో అధిక లాభాలు సాధించే అవకాశం ఉందని రైతులు సంప్రదాయ పంటల నుంచి ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం అధిక సబ్సిడీలతో పాటు గ్యారెంటీ ధర కల్పిస్తున్నందున దళారుల ప్రమేయం లేకుండా లాభాలు నేరుగా రైతులకే అందుతాయని తెలిపారు.



ఫామ్ ఆయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

**..30 ఏండ్ల దాకా దిగుబడి**

ఆయిల్ పామ్ మొక్కలను ఒకసారి నాటితే 30 సంవత్సరాల వరకు దిగుబడి ఇస్తాయి.నాలుగో సంవత్సరం నుంచి రైతుకు పంట చేతికి వస్తుంది. మొదటి నాలుగు సంవత్సరాల వరకు ప్రభుత్వమే నిర్వహణ ఖర్చులు భరిస్తున్నది.మొదటి మూడు సంవత్సరాలు మొక్కజొన్న,పత్తి, వేరుశనగ, వరి,కూరగాయలు,లాంటి పంటలను అంతర పంటగా సాగు వేసుకోవచ్చు.నాలుగో సంవత్సరం నుంచి పంట దిగుబడి వస్తుంది.ఎకరాకు కనీసం 3 నుంచి 5 టన్నులకు తక్కువ కాకుండా దిగుబడి పొందవచ్చు. ఐదవ సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం 2 టన్నుల దిగుబడి పెరుగుతుంది.చెట్టు పెరిగే కొద్దీ మెలకువలు పాటిస్తూ పది సంవత్సరాల తర్వాత 15 నుంచి 20 టన్నుల వరకూ దిగుబడి సాధించవచ్చు.

**..ఎకరాకు రూ.2లక్షల ఆదాయం**

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుచేసే రైతులకు మొదటి నాలుగు సంవత్సరాల్లో అంతర పంటల సాగుకు,ఎరువుల ఖర్చుల కోసం ఎకరానికి రూ.4,200 ఆర్థిక సాయం అందిస్తోంది.మార్కెట్లో రూ.193 ఉన్న మొక్కలను సబ్సిడీపై కేవలం రూ.20కే రైతులకు సప్లై చేస్తోంది.డ్రిప్ యూనిట్ ఖర్చులో ఎస్సీ,ఎస్టీలకు 100 శాతం,బీసీలకు 90 శాతం,ఇతరులకు 80 శాతం సబ్సిడీగా అందిస్తోంది.

**..ఆయిల్ పామ్ వైపుగా దృష్టి సారించాలి**

**:భరత్ కుమార్,వ్యవసాయ శాఖ అధికారి..**

మండల రైతులు ఆయిల్ పామ్ వైపు దృష్టిసారించాలి.ఈ పంట సాగు చేసే రైతులకు తెలంగాణ ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు అందిస్తున్నది.ఈ పంట మన ప్రాంతానికి కొత్త అయినా ఇక్కడి వాతావరణం,భూములు అనుకూలంగా ఉన్నాయి.మొక్కలు నాటడం,సస్యరక్షణ చర్యలు,పంటల విక్రయాల వరకు ఉద్యాన శాఖ అండగా ఉంటుంది.ఆసక్తిగల రైతులు నార్సింగి రైతు వేదిక కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

# కాంగ్రెస్ పార్టీ నాయకుల జోలికి వస్తే ఖబడ్దార్

**చిన్నశంకరంపేట,మే 24,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలంలో అధికార-ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ప్రధానంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు పోటాపోటీగా విమర్శలు చేసుకుంటూ ఆరోపణలకు దిగుతున్నారు. తాజాగా నాలుగు రోజుల క్రితం రైతు రాజయ్య ఆత్మహత్య విషయం రెండు పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. రైతు రాజయ్య ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని అధికార పార్టీ అంటే, లేదు ధాన్యం అమ్ముడుపోకనే రైతు మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని బిఆర్ఎస్ పార్టీ ఆరోపిస్తుంది. ఆగ్రహారం గ్రామానికి చెందిన రైతు రాజయ్యకు చెందిన ధాన్యం తూకం చేస్తే వచ్చే డబ్బులతో రైతు రాజయ్య చేసిన అప్పులు తీరిపోతుండే అని, కొనుగోలు కేంద్రాలకు లారిలు రాకపోవడంతోనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని ఖండిస్తూ శుక్రవారం నాడు కాంగ్రెస్ నాయకులు విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం బిఆర్ఎస్ నాయకులు కూడ విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకులను విమర్శించారు. ఆదివారం నాడు మరోసారి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మోహన్ నాయక్ విలేఖరుల సమావేశం ఏర్పాటు చేయగా జిల్లా నాయకులు రాజిరెడ్డి మాట్లాడుతూ...మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డిని ఎక్కడా కూడ వ్యక్తిగతంగా కూడ దూషించలేదని, గత పాలనలో అభివృద్ధి చేయలేదని తెలిపారు. వ్యక్తిగతంగా మాట్లాడామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం బిఆర్ఎస్‌లో ఉన్న నాయకులు కొందరు బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ ఖండువా కప్పుకున్నారని, కాంగ్రెస్‌లో చేరిన నాటినుండి పద్మారెడ్డి, కొంత మంది మండల నాయకుల కుటుంబసభ్యుల గురించి, మరో నాయకుడు గురించి పూర్తి వివరాలను తెలిపింది వారేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్‌లో చేరి ఇప్పుడు ఏమి ఎరగనట్లు తిరిగి మాపై విమర్శలు చేయడం తగదన్నారు. బిఆర్ఎస్ నాయకులు బహిరంగ సమావేశానికి హాజరు కావాలని, వారిని తిట్టిన విషయం, మీ నాయకులు మాట్లాడిన విడియో టెపులు, ఆధారాలు కూడ మా వద్ద ఉన్నాయని అన్నారు. ఓ గిరిజన బిడ్డను మండలాధ్యక్షుడిని చేసిన ఘనత కాంగ్రెస్‌దే అని, బిఆర్ఎస్ పాలనలో ఒక్క దళిత బిడ్డ అయినా మండలానికి అధ్యక్షునిగా పనిచేశాడా అని ప్రశ్నించారు. మండలంలో ఎన్ని రెండు పడకగదులు ఇచ్చారో చెప్పాలన్నారు. ఇప్పుడు ఏ ఊరికి వెళ్లినా ఇందిరమ్మ ఇండ్లు దర్శనమిస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల జోలికి వస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని, అవసరమైతే ఎక్కడిదాకా అయినా వెళ్లడానికి సిద్దంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మోహన్ నాయక్, రమేష్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, ఎడ్ల కిష్టయ్య, ప్రవీణ్, రాజాసింగ్, వెంకట్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

# చిలపల్లి భారీ-చోరీ కేసును ఛేదించిన మెదక్ పోలీసులు

## కోటి ముప్పై ఐదు లక్షల విలువైన బంగారం, వెండి వస్తువుల రికవరీ... ...ఒకరి అరెస్ట్ ..పరారీలో మరో ఇద్దరు...కేసు చేదించిన పోలీసు బృందాలకు రివార్డులు...మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు...




మీడియా సమావేశంలో నిందితున్ని ప్రవేశపెట్టిన పోలీసులు

**పెద్దశంకరంపేట, మే 24, ప్రభాతవార్త :** మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం చిలపల్లి గ్రామంలో జరిగిన భారీ చోరీ కేసును మెదక్ జిల్లా పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేశామని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. దొంగిలించబడిన భారీ మొత్తంలో బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పూర్తి వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో వెల్లడిస్తూ...ఈ నెల 14వ తేదీ రాత్రి గ్రామంలోని తాళం వేసిన ఐదు ఇండ్లను లక్ష్యంగా చేసుకున్న దుండగులు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. ఒకే ఇంట్లో సుమారు 109 తులాలు 9 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండున్నర కిలోల వెండి వస్తువులు, రూ.19 వేల నగదు అపహరించారు. మరో ఇంట్లో మూడు తులాల బంగారం దొంగిలించారని పేర్కొన్నారు. ఘటనపై కేసులు నమోదు చేసిన పోలీసులు దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసామన్నారు. సాంకేతిక ఆధారాలు, గూఢచారి సమాచారంతో నిందితులను గుర్తించి రామాయంపేట సమీపంలో చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 929.7 గ్రాముల బంగారం, 1.7 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రధాన నిందితుడు జాదవ్ జైరాం నాయక్ అలియాస్ జెమ్లా నాయక్‌పై ఇప్పటికే పలు జిల్లాల్లో అనేక చోరీ కేసులు ఉన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. శంకరంపేటఏ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఐదు కేసులతో పాటు కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో జరిగిన మరో 12 కేసులను కూడా నిందితుడు ఒప్పుకున్నట్లు తెలిపారు.

మొత్తం 17 కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు వెల్లడించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని ఎస్పీ తెలిపారు.



రికవరీ చేసిన ఆభరణాలు

నిందితులను వేగంగా పట్టుకున్నందుకు బాధితులు రాములు, మాణిక్ రెడ్డి జిల్లా ఎస్పీతో పాటు కేసు దర్యాప్తు చేసిన పోలీసు సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాధితుడు రాములు మాట్లాడుతూ తమ బంగారం మళ్లీ దొరుకుతుందని ఆశించలేదని, దొంగతనం జరిగినప్పటి నుంచి పోలీసులు అండగా నిలిచి ధైర్యం చెప్పారని తెలిపారు. రాత్రింబవళ్లు కష్టపడి కేసును ఛేదించిన పోలీసు శాఖకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కేసులో విశేషంగా కృషి చేసిన ఐదు ప్రత్యేక బృందాల సిబ్బందికి రివార్డులు, నగదు పురస్కారాలు అందజేశారు. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, విలువైన బంగారాన్ని బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని ఎస్పీ సూచించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐలు రేణుక రెడ్డి, జార్జ్, సందీప్ రెడ్డి, ఎస్ఐలు శంకర్, ప్రవీణ్ రెడ్డి, పోచయ్య, సీసీఎస్ బృందం, ఐటీ కోర్ సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.



పాము కాటుకు గురైన బాలుడు తనీష్

# వరిగుంటం గ్రామంలో విషాదం

## పాము కాటుతో బాలుడు మృతి

**కొల్చారం, మే 24, ప్రభాతవార్త :** కొల్చారం మండల పరిధిలోని వరిగుంటం గ్రామంలో పాము కాటుతో ఓ బాలుడు మృతి చెందిన విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దండు సుధీర్, భార్య, కుమారుడు దండు తనీష్ (7)తో కలిసి శనివారం రాత్రి భోజనం అనంతరం వేసవి కాలం కావడంతో ఇంటి ముందు వాకిట్లో నిద్రించారు.

ఆదివారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో తనీష్ నిద్రలో నుంచి లేచి తన ఎడమ చేతి మధ్యవేలికి ఏదో కరిచిందని తండ్రికి తెలిపాడు. వెంటనే పరిశీలించగా వేలిపై గాయం కనిపించడంతో పాటు బాలుడు కప్పుకున్న దుప్పటిలో నల్లని నూనె కట్లపాము కనిపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దీంతో వెంటనే బాలుడిని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిన్నపిల్లల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం సుమారు 6.20 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

తన కుమారుడు ఇంటి ముందు వాకిట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురై మృతి చెందాడని, ఈ ఘటనపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని బాలుడి తండ్రి దండు సుధీర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మహేష్ కుమార్ చేస్తున్న కృషి ప్రశంసనీయం

**నర్సాపూర్, మే 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కృషితో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్ అన్నారు. ఆదివారం పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు నర్సాపూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీరాజు యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేష్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా లు పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గతంలో కంటే కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అయిందన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి మరియు ప్రజాసేవకు కట్టుబడి పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలను విజయవంతం



పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్.

# దౌల్తాబాద్‌కు రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించండి

**హత్నూర మే 24, ప్రభాతవార్త :** హత్నూర మండలం మేజర్ గ్రామపంచాయతీ దౌల్తాబాద్‌కు రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మేజర్ పంచాయతీ దౌల్తాబాద్ పంచాయతీ కార్యదర్శిని, పక్కనే ఉన్న హత్నూర గ్రామ పంచాయతీకి ఇంచార్జిగా నియమించారని, ఇక్కడ మాత్రం వారానికి ఒక గ్రామపంచాయతీ కార్యదర్శి చొప్పున ఇన్చార్జిలుగా వచ్చి పోతున్నారని దీనివల్ల స్థానిక ప్రజలకు సమస్యల పరిష్కారంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. తమ గ్రామపంచాయతీ కార్యదర్శి హత్నూరకు పంపడంలో అంతర్యం ఏమిటని వారు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని మండల, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఇన్చార్జి కార్యదర్శులను నియమిస్తున్నారే తప్ప, తమకు కేటాయించిన కార్యదర్శిని మాత్రం ఇక్కడికి పంపించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. పర్మినెంట్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో గత వారం రోజుల నుండి పంచాయతీ కార్యదర్శి రూముకు తాళం వేసి ఉందని, తమ పనులపై వచ్చే ప్రజలకు సరైన సమాధానం చెప్పేవారు లేకుండా పోయారని వారు



సమావేశాన్ని బహిష్కరించిన వార్డు సభ్యులు



తాళం వేసి ఉన్న పంచాయతీ కార్యదర్శి రూము

ఆరోపిస్తున్నారు. శనివారం జరిగిన గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశంలో కూడా ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి నియమించాలని కోరుతూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. కాంగ్రెస్‌కి సంబంధించిన పలువురు వార్డు సభ్యులు సమావేశాన్ని బహిష్కరించి దౌల్తా బాద్ గ్రామపంచాయతీకి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని వారు డిమాండ్ చేశారు.